క్లుప్తంగా

ముక్కంటి సేవలో నటుడు సుహాస్



శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శనివారం నటుడు సుహాస్ దర్శించుకున్నాడు. దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు ఆయనను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

శాస్త్రోక్తంగా శనీశ్వరస్వామికి తైలాభిషేకం



ప్రత్యేక అలంకరణలో శనీశ్వరస్వామి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శనీశ్వరస్వామికి శనివారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి నువ్వుల నూనె, మంచినూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామివారిని పలు పుష్పాలతో విశేషంగా అలంకరించారు. విశేష పూజలు నిర్వహించి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి వితరణ



చిన్నారులకు విద్యాసామగ్రిని అందజేస్తున్న అమరావతి

శ్రీకాళహస్తి: మండలంలోని ఎగువవీధిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులకు పిళ్లారి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యాసామగ్రి పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షురాలు అమరావతి మాట్లాడుతూ తన తండ్రి పిళ్లారి దుర్గాప్రసాద్ స్థాపించిన ఈ సంస్థ ద్వారా నిరంతరాయంగా సేవలు అందిస్తామన్నారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ రేఖ, సభ్యులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రికి సాదర వీడ్కోలు



కేంద్ర మంత్రిని సత్కరిస్తున్న జిల్లా కలెక్టర్

రేణిగుంట: తిరుమల శ్రీవారి దర్శనం అనంతరం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి శనివారం జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, టీటీడీ బోర్డు మెంబర్ భానుప్రకాష్ రెడ్డి, ఆర్డీఓ భానుప్రకాష్ రెడ్డి, నేషనల్ హైవే పీడీ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి సాదరంగా వీడ్కోలు పలికారు.

వేడుకగా ఊంజల్ సేవ



నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం సాయంత్రం వేడుకగా ఊంజల్ సేవ నిర్వహించారు. ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, ప్రధాన అర్చకుడు శ్రీధరభట్టార్య పాల్గొన్నారు.

పీ-4కు సహకరించాలని వినతి

వరదయ్యపాళెం: పీ–4 కార్యక్రమానికి సహకారం అందించాలని అపోలో టైర్స్ పరిశ్రమ ప్రతినిధులను ఎంపీడీఓ ప్రసాద్, తహసీల్దార్ సుధీర్ రెడ్డి కోరారు. శనివారం ఈ మేరకు వారు మాట్లాడుతూ సీఎస్ఆర్ నిధులతో సహకరించాలని విన్నవించారు. పరిశ్రమ ప్రతినిధి సాయిబాబా స్పందిస్తూ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

వర్షాకాలం.. జర భద్రం!

- విద్యుదాఘాతాలతో అప్రమత్తం
- తడి చేత్తో స్విచ్‌లు ముట్టుకోవడం ప్రమాదకరం
- సమస్యలపై తక్షణ స్పందనకు 1912 ట్రోల్ ఫ్రీ నంబర్ సిద్ధం





వరదయ్యపాళెం సబ్‌స్టేషన్, వరదయ్యపాళెంలో తక్కువ ఎత్తులోనే ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

వరదయ్యపాళెం: వర్షాకాలం ప్రారంభం కావడంతో రైతులు పంటల సాగుకు సమాయత్తమవుతున్నారు. అయితే ఈ సీజన్‌లో విద్యుత్ ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఎక్కువగా ఉంటుంది. అప్రమత్తంగా వ్యవహరిస్తే ప్రమాదాలకు దూరంగా ఉండవచ్చని విద్యుత్‌శాఖ అధికారులు సూచిస్తున్నారు. వానలు, గాలులకు చెట్ల కొమ్మలతో పాటు విద్యుత్ స్తంభాలు విరిగి పడుతుంటాయి. విద్యుత్ తీగలు కిందకు వాలి ప్రమాదకరంగా కనిపిస్తుంటాయి. వర్షం కురిసేసమయంలో వీటిని గమనించకపోతే ప్రమాదాల బారిన పడక తప్పదు. పొలాలకు వెళ్లే రైతులు అప్రమత్తంగా ఉండాల్సి అవసరం ఎంతైనా ఉంది. విద్యుత్ తీగలు తెగిపడి ఉన్నాయో లేదో గమనించుకోవాలి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో చాలా వరకు ట్రాన్స్‌ఫార్మర్లు ఇళ్ల మధ్యనే ఉంటాయి. వాటిలో చాలా వాటికి రక్షణ కంచెలు కూడా ఉండవు. విద్యుత్ తీగలు చెట్ల కొమ్మల మధ్య ఉండడం, పొలాల్లో చేతికి అందేలా ఉండడం, ఇళ్లకు సమీపంలో నుంచే తీగలు వెళ్లడం, స్తంభాలు విరిగిపోవడం, ఒరిగిపోవడం వంటి కారణాలతో ప్రమాదాలు జరుగుతుంటాయి. ఈ ముప్పు వర్షాకాలంలో ఎక్కువగా ఉంటుంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా సమస్య ఉంటే ట్రోల్ ఫ్రీ నంబర్ 1912కు సమాచారం ఇవ్వాలని విద్యుత్ అధికారులు సూచిస్తున్నారు.

చేయకూడని పనులు ఇవే..

- సబ్‌స్టేషన్ ఉన్న ప్రాంతంలో రక్షణ కోసం ఏర్పాటు చేసిన కంచెకు దూరంగా ఉండాలి.
- విద్యుత్ స్తంభాలు ముట్టుకోవడం చేయకూడదు.
- స్తంభాలను తాకుతూ వెళ్లే టెలిఫోన్, కేబుల్ వైర్లను ముట్టుకోవద్దు.
- తడి దుస్తులు, తడి చేతులతో విద్యుత్ పరికరాలను తాకకూడదు, మరమ్మతులు చేయకూడదు.
- చేతికందె ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను కర్రలతో గానీ, ఇనుప చువ్వలతో గానీ తాకే ప్రయత్నం చేయకూడదు.
- ఇళ్ల ముందు వెళ్లే విద్యుత్ తీగలను ముట్టుకోకూడదు.

ఇళ్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- ఫ్రిజ్, వాషింగ్ మిషన్ వంటి పరికరాల వద్దకు పిల్లలు రాకుండా చూడాలి.
- నీళ్లు ఉన్న పరిసరాల్లో విద్యుత్ పరికరాలను ఉంచకూడదు.
- వర్షం కురిస్తే జల్లులు పడే ప్రాంతంలో విద్యుత్ పరికరాలను ఉంచకూడదు. చేతులు తడిగా ఉన్నప్పుడు స్విచ్‌లను తాకకూడదు.
- ప్లగ్‌లను స్విచ్ బోర్డులోకి పెట్టే సమయం, తీసే సమయంలో గానీ స్విచ్ ఆఫ్ చేయాలి.

ఇటీవల కాలంలో విద్యుత్ షాక్‌తో మరణించినవారు

- వరదయ్యపాళెం మండలం ముస్లింపాళెంలో ఊత్తుకోట అసీం ఇంటి వద్దే కరెంటు షాక్‌తో మృతి చెందాడు. అలాగే అదే మండలంలోని బత్తలవల్లంలో ఆలయ ఉత్సవాల్లో భాగంగా విద్యుత్ దీపాలంకరణ కటౌట్ వద్ద ఆశీర్వాదం అనే వ్యక్తి మరణించాడు.
- సత్యవేడు మండలం ఎన్ఆర్ అగ్రహారంలో బాలరాజు విద్యుదాఘాతంతో మృతి చెందాడు.
- కేవీబీపురం మండలం తిమ్మసముద్రంలో సెంట్రింగ్ పనులు చేస్తుండగా సురేష్ అనే వ్యక్తి విద్యుత్ షాక్‌కు గురై మరణించాడు.
- నాగలాపురం మండలం బయటకొడింబేడుకు చెందిన చంద్రబాబు చింతకాయలు కోయడం డానికి చెట్టు ఎక్కగా విద్యుత్ లైన్లు తగిలి చనిపోయాడు.
- నాగలాపురంలోని కోట వీధికి చెందిన షణ్ముగం పిండి రుబ్బేందుకు గ్రైండర్ స్విచ్ ఆన్ చేయగా కరెంటు షాక్‌తో మరణించాడు.
- సత్యవేడు నియోజకవర్గంలోని 7 మండలాల్లో దాదాపుగా 47 మంది విద్యుదాఘాతంతో గాయాల పాలయ్యారు.





చెదులుపాకంలో విద్యుదాఘాతంతో మృతి చెందిన ఆశీర్వాదం (ఫైల్), కరెంట్ షాక్‌కు గురై మృతి చెందిన ఆవు (ఫైల్)

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి:

వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముంది. కరెంట్ తీగల్లో మార్పు గమనిస్తే వెంటనే సమీపంలోని విద్యుత్ కార్యాలయానికి సమాచారం అందించాలి. గ్రామస్థాయిలో డ్యామేజ్ అయిన పోల్స్ గురించి సమాచారం ఇస్తే తక్షణమే మరమ్మతులు చేయిస్తాం. ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాలు జరగకుండా ఉండే అవకాశముంది.

– రమేష్, ఏడీఈ, విద్యుత్‌శాఖ, నాగలాపురం

పింగళి వెంకయ్యకి నివాళులు



పింగళి వెంకయ్యను నివాళులు అర్పిస్తున్న స్కౌట్స్ అండ్ గైడ్స్

శ్రీకాళహస్తి: భారత జాతీయ పతాక రూపాకర్త పింగళి వెంకయ్య జయంతిని బాబుఅగ్రహారం పురపాలక ఉన్నత పాఠశాలలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం శ్రీదేవి మాట్లాడుతూ పింగళి స్వాతంత్ర్య ఉద్యమాల్లో పాల్గొన్నారన్నారు. 1876 ఆగస్టు 2న కృష్ణా జిల్లా భట్లపెనుమూరులో జన్మించిన ఆయన 1921 మార్చి 31 ఏప్రిల్ 1 వరకు విజయవాడలో మహాత్మాగాంధీ అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్ కమిటీ సమావేశంలో ఆయన రూపొందించిన జాతీయ పతాకాన్ని ఏకగ్రీవంగా నిర్ణయించారని చెప్పారు. కార్యక్రమంలో స్కౌట్స్ మాస్టర్లు ఎస్ కే.అజారుద్దీన్, వెంకటాద్రి, యోగానందం, మురళి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పింగళి వెంకయ్య జయంతి



నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల్లో శనివారం జాతీయ పతాక రూపకర్త, స్వాతంత్ర్య సమరయోధుడు పింగళి వెంకయ్య 149వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు రమణయ్య, ఉపాధ్యాయులు ఈ మేరకు వెంకయ్య చిత్రపటానికి అంజలి ఘటించారు.

మోసాలతోనే బాబు పాలన



క్యూ ఆర్ కోడ్ పోస్టర్ ప్రదర్శిస్తున్న నేతలు

నారాయణవనం: హామీలను గుప్పించి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు మోసాలతోనే పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నేతలు ఆరోపించారు. శనివారం మండలంలోని కీళగరం, వెత్తలతడుకు, బొప్పరాజుపాళ్యం, సముదాయం పంచాయతీలలో పార్టీ మండల కన్వీనర్ సొరకాయలు నేతృత్వంలో ।బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ప్రజలతో రచ్చబండ చేపట్టారు. ఎంపీపీ దివాకర్‌రెడ్డి, నేతలు రాకేష్ కిరణ్, అన్నాదొరై, సర్పంచ్‌లు సాయిరవి, సుబ్రమణ్యంరెడ్డి, నాగూరు, మురళి, ఎంపీటీసీ సభ్యులు పొన్నుస్వామి, రవి, నేతలు సుబ్రమణ్యం యాదవ్, గురుస్వామి, హేమచంద్రారెడ్డి, గోవిందస్వామి, మంజునాథ్, చీరాలయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



ప్రమాదంలో మృతి చెందిన సెల్వరాజ్

వరదయ్యపాళెం: శ్రీసిటీలోని ఓ పరిశ్రమలో పనిచేస్తున్న యువకుడు విధులు ముగించుకుని తిరిగి ఇంటికి వెళుతుండగా మార్గం మధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. ఈ ఘటన మండలంలోని చిన్న పాండూరు సమీపంలోని నక్కలమిట్ట వద్ద శనివారం చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యుల కథనం మేరకు.. పెద్ద పాండూరులోని ముత్తరాశి పాళేనికి చెందిన సి. సుబ్రమణ్యం కుమారుడు సి.సెల్వరాజ్ (21) శ్రీసిటీలోని ఓ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. శనివారం ఉదయం రోజులాగే పరిశ్రమలో విధులకు వెళ్లాడు. అక్కడ విధులు ముగించుకుని సాయంత్రం ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుండగా చిన్న పాండూరు సమీపంలోని నక్కలమిట్ట వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి పక్కనే ఉన్న కల్వర్టు గోడను ఢీకొంది. గాయపడిన సెల్వరాజ్‌ను స్థానికుల సహకారంతో 108 ద్వారా చికిత్స నిమిత్తం సత్యవేడు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో యువకుడు మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు శ్రీసిటీ హైటెక్ పోలీస్ స్టేషన్ సీఐ బీవీ శ్రీనివాసులు తెలిపారు.

బెదిరింపులు సహించం



మాట్లాడుతున్న నరసింహయాదవ్

సత్యవేడు: నియోజవర్గంలో కొందరు నేతలు బెదిరింపులకు దిగుతున్నారని, వాటిని సహించే ప్రసక్తే లేదని యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్ స్పష్టం చేశారు. శనివారం బేరిశెట్టి కళ్యాణ మండపంలో టీడీపీ ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాత సుఖీభవ మెగా చెక్ పంపిణీలో ఆయన పాల్గొన్నారు. అయితే అప్పటికే ఎమ్మెల్యే ఆదిమూలం చెక్‌ను పంపిణీ చేసేయడంతో ఆ ప్రయత్నం విరమించుకున్నారు. నరసింహ యాదవ్ మాట్లాడుతూ ఎవరైనా సరే పార్టీ హైకమాండ్ నిర్ణయాలకు కట్టుబడి ఉండాల్సిందే అన్నారు. ఏదైనా సమస్య ఉంటే జిల్లా నాయకత్వానికి తెలియజేయాలని సూచించారు.

ఆటోవాలాల నిరసన

రేణిగుంట: పట్టణంలోని రహదారులు గుంతలు పడడంతో ఆటోలు దెబ్బతింటున్నాయని ఆటోడ్రైవర్లు వాపోతున్నారు. పట్టణంలోని ప్రధాన రహదారుల్లో గుంతలు ఉండడాన్ని నిరసిస్తూ శనివారం ఆటో యూనియన్ సభ్యులు పంచాయతీ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. అనంతరం సర్పంచ్ నగేశంకు వినతిపత్రం అందించారు. రెండురోజుల్లో గుంతలకు మరమ్మతులు చేయిస్తామని సర్పంచ్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆటో గౌరవ అధ్యక్షుడు వీఆర్ రావణన్ మాట్లాడుతూ గుంతల వల్ల ఆటోలు నడుపుతూ ప్రతిరోజు రిపేరీలతో ఇబ్బంది పడుతున్నామని అన్నారు. అధ్వానంగా ఉన్న రోడ్లలో వెళ్లేటప్పుడు ప్రయాణికుల భద్రత కూడా ప్రశ్నార్థకంగా మారిందని తెలిపారు. వెంటనే రహదారులకు మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు నవీన్, నాయకులు సురేష్, సూరి నాగరాజు, వాలాజ నాయుడు తదితరులు పాల్గొన్నారు.





నిరసన తెలుపుతున్న ఆటో డ్రైవర్లు, సర్పంచుకు వినతిపత్రం అందిస్తున్న ఆటోడ్రైవర్లు

వైభవంగా అగ్నిగుండ ప్రవేశం

నారాయణవనం: భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం సాయంత్రం వైభవంగా అగ్నిగుండ ప్రవేశం నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేసి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి ఉత్సవర్లకు పులివాహన సేవ చేపట్టారు. వీరభద్రస్వామివారు కోటవీధి, సెంగుందర్ వీధుల్లో విహరిస్తూ కర్పూ హారతులు అందుకున్నారు. ఏఈఓ రవి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్ తదితరులు పర్యవేక్షించారు. ఆదివారం సాయంత్రం గజవాహనంపై ఉత్సవర్లు ఊరేగనున్నట్లు ఆలయ అధికారి నాగరాజు తెలిపారు.



ఊరేగుతున్న వీరభద్రస్వామి

బడి బయట పిల్లలకు కౌన్సెలింగ్

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని గాజులపెళ్లూరు పంచాయతీ ఆదిలక్ష్మయ్య గిరిజన కాలనీలో బడికి వెళ్లకుండా ఇంటి వద్ద ఉన్న పిల్లలు, తల్లిదండ్రులకు ఎంఈఓ–2 మునిసుబ్రమణ్యం శనివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ విద్యాహక్కు చట్ట ప్రకారం బడిఈడు పిల్లలు తప్పనిసరిగా బడిలో ఉండాలని తెలిపారు. చదువుతోనే సమాజంలో గౌరవంతోపాటు ఉన్నత స్థానం వస్తుందని వెల్లడించారు. ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యతోపాటుగా ఉచితంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్, బెల్ట్, నోట్‌బుక్స్, డిక్షనరీ, బూట్లు, సాక్సులు అందించడంతో పాటు రుచికరమైన పౌష్టికాహారం అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయని ఎల్లమ్మ పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా





బోల్తా పడిన ట్రాక్టర్, గాయపడిన కూలీలు

వరదయ్యపాళెం: సూళ్లూరుపేట–బీఎన్‌కండ్రిగ మార్గంలో శనివారం ఇటుకల లోడ్‌తో వెళుతున్న ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడడంతో ముగ్గురు కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. కువ్వాకొల్లి పంచాయతీ లక్ష్మీపురం సమీపంలో ప్రమాదం జరిగింది. క్షతగాత్రులను 108లో సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వివరాలు సేకరించి కేసు నమోదు చేయనున్నట్లు ఎస్ఐ మల్లికార్జున తెలిపారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటుకు డిమాండ్

వరదయ్యపాళెం: చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ సత్యవేడు నియోజకవర్గ గౌరవాధ్యక్షుడు చిన్నిరాజ్ డిమాండ్ చేశారు. శనివారం వరదయ్యపాళెం బస్టాండ్ ఆవరణలో ఆటో డ్రైవర్లతో కలసి నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ వాహనమిత్ర ద్వారా ఆటో డ్రైవర్లకు తక్షణమే రూ. 15వేల చొప్పున చెల్లించాలన్నారు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న ఉచిత బస్సు పథకంతో ఆటో కార్మికులకు తీవ్రమైన నష్టం వాటిల్లనుందని ఆందోళన వ్యక్తం చేశారు. నేతలు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనే లక్ష్యం

బుచ్చినాయుడుకండ్రిగ: బాల్య వివాహాల నిర్మూలనే లక్ష్యంగా పనిచేయాలని మండల ఆరోగ్యశాఖాధికారి వెంకటేశులు కోరారు. శనివారం పల్లమాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు బాల్య వివాహాల కారణంగా వాటిల్లే అనర్థాలపై అవగాహన కల్పించారు. శారీరకముగా ఎదగకముందే వివాహం జరిపిస్తే రక్తహీనత తలెత్తుతుందన్నారు. దీంతో గర్భస్రావం జరగడం, కాన్పు కష్టమై మాతా శిశు మరణాలు సంభవించే ప్రమాదముందని వెల్లడించారు. బాలికలకు 21 ఏళ్లు, బాలురకు 25 ఏళ్లు వచ్చిన తర్వాత పెళ్లి చేస్తే ఆరోగ్యవంతమైన సంసారం, పిల్లలు ఉంటారని వివరించారు. బాల్యవివాహాలను ప్రోత్సహిస్తే జైలుశిక్ష తప్పదని హెచ్చరించారు. ప్రధానోపాధ్యాయని గాయత్రి పాల్గొన్నారు.

'సుఖీభవ' చెక్కు పంపిణీ



మెగా చెక్ అందిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

సత్యవేడు: నియోజక వర్గ పరిధిలోని ఏడు మండలాల్లో 30వేల మంది రైతులకు రూ. 21 కోట్లను అన్నదాత సుఖీభవ పథకం తొలి విడత కింద రైతుల ఖాతాల్లో శనివారం జమచేసినట్లు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. బేరిశెట్టి కళ్యాణ మండపంలో ఈ మేరకు మెగా చెక్‌ను రైతులకు అందజేశారు. డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్, ఏడీఏ సుబ్రమణ్యం, జెడ్పీఫైనాన్స్ కమిటీ సభ్యుడు సుమన్ కుమార్, జెడ్పీటీసీ సభ్యులు విజయలక్ష్మి, తహసీల్దార్లు, ఎంపీడీఓ, ఏఓలు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్

శ్రీకాళహస్తి: తల్లిపాల వారోత్సవాలు సందర్భంగా శ్రీకాళహస్తి రూరల్ మండలం జగ్గరాజుపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో స్త్రీశిశు సంక్షేమ శాఖ కమిటీ అధ్యక్షుడు మేనేజ్‌మెంట్ న్యూట్రిషన్ సంయుక్త ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు వెంటనే ముర్రిపాలు తాగించాలని.. ఆ పాలతోనే బిడ్డకు ఆరోగ్యమని తెలిపారు. కమ్యూనిటీ బేస్డ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ లక్ష్మీ మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని పౌష్టికాహారం తీసుకుంటేనే బిడ్డకు పాలు సమృద్ధిగా ఇవ్వగలరని తెలిపారు. అందుకే బిడ్డ ఆరోగ్యంగా పెరుగుతారన్నారు.

ముర్రుపాలతో రోగనిరోధకశక్తి

బుచ్చినాయుడుకండ్రిగ: బిడ్డ పుట్టిన వెంటనే తల్లి ముర్రుపాలు తాగిస్తే రోగనిరోధకశక్తి పెరుగుతుందని మండల ఆరోగ్యశాఖాధికారి వెంకటేశులు తెలిపారు. శనివారం పల్లమాలలో గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు.

తల్లి పాలలో ఔషధ గుణాలు

నాగలాపురం: తల్లి పాలలో ఔషధ గుణాలుంటాయని, పుట్టిన వెంటనే శిశువుకు తప్పని సరిగా తాగించాలని పిచ్చాటూరు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి తెలిపారు. బైటకొడియంబేడు అంగన్‌వాడీ కేంద్రంలో సీడీపీఓ సౌభాగ్యమ్మ ఆధ్వర్యంలో తల్లి పాల వారోత్సవాలలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ప్రైమరీ స్కూల్ టీచర్లు, ఏఎన్ఎం లావణ్య, ఎంఎల్‌హెచ్‌పీ, అంగన్‌వాడీ టీచర్ పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేష్టం

తొట్టంబేడు: తల్లిపాలు బిడ్డకు శ్రేష్టమని తొట్టంబేడు బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్ అన్నారు. తొట్టంబేడు మండలం బోడవరం అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కాసరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యసిబ్బంది గర్భిణులకు, బాలింతలకు సూచనలు, సలహాలు ఇచ్చారు. వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అమ్మ పాలు అమృతం

నారాయణవనం: చంటి పిల్లలకు అమ్మ పాలు అమృతమని ఆరోగ్య సిబ్బంది తెలిపారు. శనివారం నారాయణవనం వీవర్స్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులతో సమావేశం నిర్వహించారు. వైద్యాధికారి రాగసుధ మాట్లాడుతూ పిల్లలకు తల్లిపాలతో సమృద్ధిగా పోషకాలు అందుతాయని వెల్లడించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యశోద, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆటో బోల్తా పడి 9 మందికి గాయాలు



ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పచ్చాలమ్మ కాలనీ వద్ద కేటీరోడ్డులో శనివారం ఆటో అదుపుతప్పి బోల్తాపడి 9 మందికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. శ్రీకాళహస్తి టౌన్‌కు చెందిన వనమ్మ, ప్రమీల, లత, మల్లీశ్వరి, పెంచులమ్మ, అంజలి, జ్యోతి, శోభ, వాలేటమ్మ సూళ్లూరుపేట మండల మాన్నారుపోలూరులోని సీసీఎల్ కాఫీ కర్మాగారంలో పనిచేస్తున్నారు. శనివారం ఉదయం విధులు ముగించుకుని ఆటోలో శ్రీకాళహస్తి వస్తుండగా మార్గమధ్యంలో పచ్చాలమ్మ కాలనీ వద్ద కేటీ రోడ్డు ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ఆటోలోని 9 మందికి స్వల్ప గాయాలయ్యాయి. డ్రైవర్ రాజకు ఎలాంటి గాయాలు కాలేదు. వీరిని 108 అంబులెన్స్‌లో శ్రీకాళహస్తిలోని ఏరియా ఆసుపత్రికి తరలించి, చికిత్స అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ విశ్వనాథనాయుడు తెలిపారు.